జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 8 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 9

# ఇటు దేవుడి భక్తి... అటు ప్రజాసేవ!



7 లో...

- గిరిజన కౌలు రైతే లక్ష్యంగా రూ. 2.50 కోట్ల భూకబ్జా ప్రణాళిక నడిచిందా..?
- సత్తుపల్లి వ్యాపారితో రూ. 50 లక్షల ముందస్తు అడ్వాన్స్ దందా జరిగినట్లు ఆరోపణలు!
- భూమిని ఖాళీ చేసేందుకే రూ. 70 లక్షల జామాయిల్ తోట ధ్వంసం చేశారంటున్న బాధిత వర్గాలు!
- కౌలు రైతును బెదిరించడమే పనిగా లక్ష్మీదేవిపల్లి పోలీసుల ఏకపక్ష వైఖరిపై విమర్శలు!
- జామాయిల్ తుడిచిపెట్టి పామాయిల్ తోట నాటే కుట్ర వెనుక 'అనిల్' ముఠా ప్రమేయం ఉందా..?
- ఎమ్మార్వో శిరీష స్పష్టమైన విచారణ నివేదిక ఇచ్చినా కదలని పోలీస్ యంత్రాంగం!
- మాజీ సీఐ రాయల వెంకటేశ్వర్లు సమక్షంలో 25% వాటా పంచాయితీలు నడిచాయనేది నిజం కాదా..?
- పోలిస్ బాస్ జోక్యం చేసుకుని ఈ కోట్ల 'భూ' ముఠా గుట్టు రట్టు చేయాల్సిందే!



# 60 ఎకరాల 'భూకబ్జా స్కెచ్'.. రూ.2.50 కోట్ల బేరం?

8 లో..




9 లో..

# యువతలో మార్పే.. నాకు అసలైన సంతృప్తి..!

## గోదావరి పుష్కర పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



- పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ట్రాఫిక్ చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్_
- ఎస్పీ రోహిత్ రాజ్
- పుష్కరాల నోడల్ అధికారిగా భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్

2 లో...

- ఆరోపణలు వచ్చినా.. మళ్లీ జిల్లాలోనే 'ఎస్‌బీ సీఐ'గా పోస్టింగ్!
- లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ పీఎస్ పరిధిలో బాధితులకు తప్పని తిప్పలనే విమర్శలు!
- నెలల కిందటే బదిలీ లేఖ వచ్చినా రాజకీయాధికారంతో తొక్కిపెట్టారనే ఆరోపణలు!
- కోర్టు ఇంజక్షన్, ప్రొటెక్షన్ ఆర్డర్లు ఉన్నా రక్షణ కరవు.. నిమజ్జనంలో ఆంక్షలు.. కౌలు రైతు తోట ధ్వంసం!
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులకు ఈ అధికారి వేధింపుల నుంచి విముక్తి ఎప్పుడు?



2 లో..

# వీడేది ఎన్నడు.. 'రాయుల' గ్రహణం..?

# వీడేది ఎన్నడు.. 'రాయల' గ్రహణం..?

- ఆరోపణలు వచ్చినా.. మళ్లీ జిల్లాలోనే 'ఎస్‌బీ సీఐ'గా పోస్టింగ్!
- లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ పీఎస్ పరిధిలో బాధితులకు తప్పని తిప్పలనే విమర్శలు!
- నెలల కిందటే బదిలీ లేఖ వచ్చినా రాజకీయాధికారంతో తొక్కిపెట్టారనే ఆరోపణలు!
- కోర్టు ఇంజక్షన్, ప్రొటెక్షన్ ఆర్డర్లు ఉన్నా రక్షణ కరవు.. నిమజ్జనంలో ఆంక్షలు.. కౌలు రైతు తోట ధ్వంసం!
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులకు ఈ అధికారి వేధింపుల నుంచి విముక్తి ఎప్పుడు?



**(భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి)** లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మూడు పోలీస్ స్టేషన్లకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రాయల వెంకటేశ్వర్లు హయాంలో స్థానిక ప్రజలు, బాధితులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఆయన ఎక్కడ పనిచేసినా బాధితులకు వేధింపులు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు అండగా నిలవాల్సింది పోయి.. సెటిల్మెంట్లు, బేరసారాలకు ప్రాధాన్యమిస్తూ జిల్లా వాసులకు ఒక 'గ్రహణం'లా మారారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా విమర్శల నేపథ్యంలో ఆయనను సివిల్ విధుల నుంచి తప్పించినప్పటికీ, తిరిగి అదే జిల్లాలోనే అత్యంత సున్నితమైన, కీలకమైన జిల్లా ఎస్‌బీ (స్పెషల్ బ్రాంచ్) సీఐగా పోస్టింగ్ ఇవ్వడం పట్ల ప్రజల్లో, బాధిత వర్గాల్లో తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది.

### 'తప్పించాలంటూ' లేఖ.. రాజకీయాధికారంతో పక్కనబెట్టారా..?

రాయల వెంకటేశ్వర్లు వైఖరిపై బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వివాదాల తీవ్రతను గమనించిన పైస్థాయి ఉన్నతాధికారులు ఆయనను చుంచుపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల నుంచి తక్షణమే తప్పించాలని కొన్ని నెలల కిందటే అధికారిక ఆదేశాల లేఖ పంపినట్లు పోలీస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఆ లేఖను స్థానికంగా అమలు చేయకుండా తొక్కిపెట్టడం వెనుక ఉన్నత స్థాయి రాజకీయ నేతల ప్రమేయం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కేవలం ప్రజా ప్రతినిధులు, బడా నాయకుల మెప్పు పొందడమే పనిగా పెట్టుకోవడమే కాకుండా.. ఉన్నతాధికారుల వద్ద లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్లు చెబుతూ (చెవులు కొరికే నైజం) ఈ అధికారి తన స్థానాన్ని కాపాడుకున్నారని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

### 'రాయల'పై వచ్చిన ఆరోపణలు ఇలా..

**కోర్టు ఆదేశాలు ఉన్నా ప్రొటెక్షన్ కరవు (చుంచుపల్లి పరిధి):**

చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బృందావనం కాలనీలోని సర్వే నంబర్ 128/2 లో ఉన్న భూమి భానోత్ మంగమ్మ పేరిట ఉన్న వంశ పారంపర్య పట్టాభూమి. అయితే ఆమె బంధువుల్లో ఒకరు ఉద్దేశపూర్వకంగా భూమిలోకి చొరబడి ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ బాధితులు పోలీసులను ఆశ్రయించినా కనీసం పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. దాంతో బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి 'ఇంజక్షన్ ఆర్డర్'తో పాటు 'పోలీస్ ప్రొటెక్షన్ ఆర్డర్' కూడా తెచ్చుకున్నారు. అయితే సీఐ రాయల వెంకటేశ్వర్లు ఆ కోర్టు ఆర్డర్లను ఏమాత్రం లెక్కచేయకుండా, ప్రొటెక్షన్ కల్పించకపోగా.. "అవతలి వ్యక్తులతో మాట్లాడి సెటిల్ చేసుకోండి.. లేదంటే ఇబ్బందులు పడతారు" అని ఉచిత సలహాలు ఇస్తూ, పట్టాదారులకే బెదిరింపులు గురిచేసి భయభ్రాంతులకు గురిచేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**గిరిజనుల వినాయక నిమజ్జనంపై ఆంక్షల వివాదం (సుజాతనగర్ పరిధి):**

ఇటీవల వినాయక చవితి పండుగ సందర్భంగా సుజాతనగర్ పరిసర ప్రాంతంలోని ఒక గిరిజన తండా ప్రజలు మేళతాళాలతో దేవుని ఊరేగింపు చేస్తుండగా సీఐ తన బృందంతో చేరుకుని అడ్డుకున్నట్లు సమాచారం. శోభాయాత్రను సాఫీగా జరగనివ్వకుండా ఆ గ్రామంలోనే అర్ధరాత్రి వరకు సిబ్బందితో మోహరించారని తెలుస్తోంది. 11 రోజుల పాటు ఎంతో నిష్ఠతో పూజలు చేసి భద్రాచలంలో గోదావరి నదిలో వినాయక నిమజ్జనానికి, పుణ్యస్నానాలకు వెళ్లాలని భావించిన గిరిజన భక్తులను అడ్డుకున్నారనే ఆరోపణలు కలకలం రేపాయి. గిరిజనులను భద్రాచలం వెళ్లకుండా నిరోధించి, బలవంతంగా స్థానికంగా ఉన్న సింగభూపాలెం చెరువులోనే నిమజ్జనం చేయించడం ద్వారా వారి ఆధ్యాత్మిక భావాలను దెబ్బతీశారని విమర్శలు వచ్చాయి. అయితే సదరు తండా వాసులు సీపీఐ వర్గానికి చెందినవారు కావడంతో, స్థానిక కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్ల వల్లే సీఐ ఈ తరహా చర్యలకు పాల్పడ్డారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఆ రోజు రాత్రి కొందరు ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి నేతలు పోలీసు అధికారులతో మాట్లాడినట్లు స్థానిక యువకులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో నిష్పాక్షిక విచారణ జరిపి, ఆ రాత్రి సంబంధిత అధికారుల సిడిఆర్ (కాల్ డీటెయిల్ రికార్డ్) సేకరిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని వారు కోరుతున్నారు.

**కౌలు రైతు జామాయిల్ తోట ధ్వంసం (లక్ష్మీదేవిపల్లి పరిధి):**

ఇక జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కై లు రైతు పంట వ్యవహారం అందరికి తెలిసిందే. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పరిధిలోని 60 ఎకరాల భూమిలో గిరిజన రైతు అజ్మీరా మురళి పదేళ్లుగా సాగు చేస్తున్న జామాయిల్ తోటను కొందరు బడా నేతలు, రౌడీషీటర్లు దౌర్జన్యంగా ధ్వంసం చేస్తున్నా పోలీసులు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఎమ్మార్వో స్వయంగా విచారణ జరిపి నివేదిక ఇచ్చినా తోట నరికివేతను నిలిపివేయలేదు. పైగా సీఐ సమక్షంలోనే "25 శాతం వాటా ఇస్తాం" అంటూ రహస్య పంచాయితీలు నడిచాయనే ఆరోపణలు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### మళ్లీ జిల్లాలో 'ఎస్‌బీ సీఐ'గా పోస్టింగ్ దేనికి సంకేతం..?

రాయల వెంకటేశ్వర్లు సీఐగా బాధ్యతలు నిర్వహించిన సమయంలోనే ఆయన పరిధిలోని సుజాతనగర్ ఎస్ఐ సస్పెండ్ అయిన ఘటన, ఈ సర్కిల్ పరిధిలో అక్రమాలు ఏ స్థాయిలో నడిచాయో తెలియజేస్తోందని స్థానికులు చెబుతున్నారు. కింద పనిచేసే ఎస్ఐపై చర్యలు పడినా.. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పాత్రపై మాత్రం సమగ్రమైన విచారణ జరపకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే బాధితుల నుంచి ఇంతటి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్న అధికారిని సివిల్ విధుల నుంచి తప్పించినప్పటికీ.. మళ్లీ అదే జిల్లాలో అత్యంత కీలకమైన స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) సీఐగా బాధ్యతలు అప్పగించడం వెనుక ఏ అదృశ్య హస్తాలు ఉన్నాయనే చర్చ నడుస్తోంది. జిల్లాలోని నిఘా వ్యవస్థ, పోలీసుల పనితీరును పర్యవేక్షించే ఎస్‌బీ విభాగానికి ఇటువంటి వివాదాస్పద అధికారిని నియమించడం వల్ల ప్రజలకు పోలీస్ వ్యవస్థపై ఉన్న నమ్మకం సడలుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీటితో పాటు ఇతను కొన్ని ఏళ్ళుగా ఇక్కడే పనిచేస్తున్నారు. నిభందనల ప్రకారం ఒకే అధికారి ఇలా విధులు నిర్వహిచడం విరుద్ధం. ఇప్పటికైనా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి, ఆయనపై వచ్చిన ఈ ప్రధాన ఆరోపణలు, అధికారుల సిడిఆర్ రికార్డులు, ఉన్నతాధికారుల లేఖల వ్యవహారముపై నిష్పాక్షిక విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీయాలని, బాధిత ప్రజలకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# గోదావరి పుష్కర పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి )** వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని పుష్కర ఘాట్ల వద్ద చేపట్టిన పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరం లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఇప్పటికే మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులచే ప్రారంభమైన పనులతో పాటు మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ, సీపీఓ కార్యాలయం నుంచి పుష్కరాల కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని ఎస్పీ రోహిత్ రాజు, సీపీఓ సునీతలను ఆదేశించారు. గోదావరి పుష్కరాల పనుల పర్యవేక్షణకు భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్‌ను నోడల్ అధికారిగా నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పుష్కరాలకు మరో పది నెలల సమయం మాత్రమే ఉన్నందున పనుల పురోగతిని నోడల్ అధికారికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని, వారానికొకసారి పనులను సమీక్షించి పురోగతి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. భద్రాచలం పుష్కర క్షేత్రానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ తెలిపారు .ఎండోమెంట్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, వైద్య ఆరోగ్య, పోలీస్ తదితర శాఖలు తమ పరిధిలోని పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. దుమ్ముగూడెం, పర్ణశాల, మోతేపట్టి నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పుష్కర ఘాట్లకు సంబంధించి టైర్–1, టైర్–2, టైర్–3 కింద చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. పుష్కరాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పార్కింగ్, అప్రోచ్ రోడ్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులు తదితర మౌలిక వసతులను ముందస్తుగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఘాట్లకు చేరుకునే రహదారులు, ఘాట్ల మరమ్మతు పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. 2015లో నిర్వహించిన గోదావరి పుష్కరాలకు సంబంధించిన వివరాలను సేకరించి సమగ్ర నివేదికతో పాటు సుమారు 30 పేజీల ప్రత్యేక బుక్‌లెట్‌ను రూపొందించాలని సీపీఓ సునీతను కలెక్టర్ ఆదేశించారు. పుష్కర ఘాట్ ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన సూచనలు సులభంగా అందేలా డీడబ్ల్యూఓ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక గుర్తింపు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పుష్కరాల సమయంలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను తరలించేందుకు గతంలో వినియోగించిన 30 ఎకరాల డంపింగ్ స్థలాన్ని అవసరమైతే తిరిగి వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణలో అన్ని శాఖలు తమ బాధ్యతలను స్పష్టంగా గుర్తించి పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో ట్రాఫిక్, భక్తుల రద్దీని ముందస్తు ప్రణాళికతో సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పార్కింగ్ ప్రాంతాలు, హోల్డింగ్ ఏరియాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను సంబంధిత శాఖలు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖరారు చేయాలని సూచించారు. ప్రధాన రహదారులపై చేపట్టే మరమ్మతులు, రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ముందుగానే స్థానిక పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. పాల్వంచ–దమ్మపేట, తల్లాడ–భద్రాచలం, బయ్యారం, దుమ్ముగూడెం తదితర ప్రధాన మార్గాల్లో రహదారుల పరిస్థితిని ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ట్రాఫిక్ జామ్ ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలు, హోల్డింగ్ ప్రాంతాలను సిద్ధం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

హోల్డింగ్ ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, లైటింగ్ వంటి ప్రాథమిక సదుపాయాలు ఉండేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా చివరి నిమిషంలో పనుల ఒత్తిడి లేకుండా నిర్ణీత గడువుకు ముందుగానే పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.

శ్రీరామనవమి, ముక్కోటి వంటి ప్రధాన కార్యక్రమాల కారణంగా అధికార యంత్రాంగంపై అదనపు పనిభారం ఉండే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్, డీఆర్ఓ పద్మావతి, డీపీఓ అనూష, డీటీఓ భూషిత్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకర సమాజం

- గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీల సేవలు కీలకం
- అశ్వాపురం రైతు వేదికలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొమ్మిదో పోషణ మాసం కార్యక్రమం





**అశ్వాపురం: అక్టోబర్ 7 ప్రజాజ్యోతి** పోషకాహార లోపాన్ని నివారించి గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా తొమ్మిదో పోషణ మాసం కార్యక్రమాన్ని అశ్వాపురం రైతు వేదికలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు చెందిన అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యానికి, సమాజ భవిష్యత్తుకు ఎంతో కీలకమన్నారు. గర్భధారణ సమయంలో మహిళలు పోషక విలువలున్న ఆహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యుల సూచనలను పాటిస్తూ రక్తహీనత వంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

బాలింతలు తమ ఆరోగ్యంతో పాటు శిశువుల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్నారులకు తల్లిపాల ప్రాధాన్యతను తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. పిల్లల వయస్సుకు అనుగుణంగా పౌష్టికాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు బలమైన పునాది వేయవచ్చని అన్నారు.అంగన్వాడీలదే కీలక బాధ్యతగ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులకు ప్రభుత్వ ఆరోగ్య, పోషకాహార కార్యక్రమాలను చేరువ చేయడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. లబ్ధిదారులకు అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించడంతో పాటు పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి సంబంధిత వైద్య సిబ్బందికి సమాచారం అందించడంలో అంగన్వాడీ సిబ్బంది చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.పోషకాహారంపై అవగాహనపోషణ మాసం కార్యక్రమంలో సమతుల్య ఆహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, చిన్నారుల ఎదుగుదల, పోషకాహార లోపం నివారణ తదితర అంశాలపై అంగన్వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. గర్భిణీలకు గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య పరీక్షల అవసరం, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు.పిల్లలకు కేవలం కడుపు నింపే ఆహారం కాకుండా శరీరానికి అవసరమైన పోషకాలు అందేలా ఆహారపు అలవాట్లను పెంపొందించాలని సూచించారు. పరిశుభ్రమైన పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎంపీడీవో, తహసీల్దార్, అంగన్వాడీ సిబ్బంది, మహిళలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు. పోషకాహార పదార్థాల ప్రదర్శనతో పాటు వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించిన నూతన సిఐ సట్ల రాజు

- భద్రాచలం పట్టణ సీఐగా బుధవారం బాధ్యతలు స్వీకరణ
- గౌరవ ఆహ్వానం పలికిన పట్టణ ఎస్సైలు, సిబ్బంది






**భద్రాచలం, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** భద్రాచలం పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ సట్ల రాజు భద్రాద్రి రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీఐ గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా సీఐ సట్ల రాజు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ స్నేహపూర్వకంగా సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. భద్రాద్రి రామయ్యను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపడతామని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సీఐ తెలిపారు.

## మద్దతు ధరల పేరిట రైతులకు మోసం

- సీతారామ సాగు జలాలు జిల్లా రైతుల హక్కు.
- రైతు సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తాం.
- ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు




**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 7 ,(ప్రజా జ్యోతి)** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, మద్దతు ధరల పేరిట రైతాంగాన్ని నిలువునా మోసం చేస్తున్నారని ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) కొత్తగూడెం జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం బుధవారం పాల్వంచలోని సి.ఆర్. భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రాజెక్టు ద్వారా స్థానిక ఆయకట్టుకు రావాల్సిన సాగునీటి హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పంట నష్టపోయిన అన్నదాతలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి రైతుకూ ఎలాంటి కోతలు లేకుండా రైతు భరోసా సాయాన్ని విడుదల చేయడంతో పాటు చివరి ఆయకట్టు వరకు సీతారామ ప్రాజెక్టు ద్వారా నిరంతర సాగునీరు అందించాలని కోరారు. పాలకుల నిర్లక్ష్య వైఖరిపై రాజీలేని పోరాటాలు సాగించాల్సిన బాధ్యత మనపై ఉందని, రైతు హక్కుల సాధనకు గ్రామస్థాయిలో సంఘాన్ని బలోపేతం చేసి ఐక్య ఉద్యమాలను ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, చంద్ర నరేంద్ర కుమార్, తాటి వెంకటేశ్వర్లు, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, వాడే లక్ష్మి, వైఎస్ గిరి, కుమారి, హనుమంతరావు, నరాటి రమేష్, చర్ప నాగేశ్వరరావు, కమటం సురేష్, కొంగర అప్పారావు, రంజిత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## లేంద్రా-కోరచోలీ జవాన్లకు దక్షతా పతకాలు





**చర్ల , అక్టోబర్ 07:(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గంగాలూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లేంద్రా–కోరచోలీ అటవీ ప్రాంతంలో 2024 ఏప్రిల్ 2న జరిగిన ఎదురుకాల్పుల్లో అత్యుత్తమ ప్రతిభ, సాహసాన్ని ప్రదర్శించిన 60 మంది భద్రతా సిబ్బందికి కేంద్ర హోంశాఖ మంత్రి దక్షతా పతకాలు అందజేశారు. డీఆర్జీ , బస్తర్ ఫైటర్స్‌కు చెందిన 50 మంది, ఎస్‌టీఎఫ్ కు చెందిన 10 మంది జవాన్లు ఈ గౌరవాన్ని అందుకున్నారు.లేంద్రా–కోరచోలీ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో భద్రతా బలగాలకు కీలక విజయం లభించింది. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు మహిళలు సహా మొత్తం 13 మంది ఆయుధాలు ధరించిన యూనిఫాం మావోయిస్టులు మృతి చెందారు.ఈ ఆపరేషన్‌లో ధైర్యసాహసాలు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది జవాన్లకు కేంద్ర హోంశాఖ మంత్రి దక్షతా పతక ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను బీజాపూర్ జిల్లా ఎస్పీ ఉమేష్‌ప్రసాద్ గుప్తా అందజేసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఆప్స్) రవీంద్ర కుమార్ మీణా, అదనపు ఎస్పీ (ఆప్స్) అమన్ కుమార్ ఝా, డీఎస్పీ (హెడ్‌క్వార్టర్స్) అభిషేక్ కేసరీ, డీఎస్పీ (ఆప్స్) సిద్ధార్థ్ సింగ్ చౌహాన్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రామనామ స్మరణతో మార్మోగిన గోదావరి తీరం

- భక్తిశ్రద్ధలతో రామకోటి పుస్తకాల నిమజ్జనం





**భద్రాచలం, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** భద్రాచలం గోదావరి నదిలో రామకోటి పుస్తకాల నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.శ్రీ సీతారామచంద్రస్వామివారి నామస్మరణతో, మహిళా భక్తుల కోలాటాలతో ఊరేగింపుగా గోదావరి వంతెన మీదకు వెళ్లి రామకోటి పుస్తకాలను గోదావరిలో నిమజ్జనం చేశారు.ఈ సందర్భంగా అర్చకులు గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి మాతకు చీర, జాకెట్టు, గాజులు, పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు.భక్తుల రామనామ స్మరణతో గోదావరి తీరం మార్మోగింది.పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని స్మరించుకున్నారు.రామకోటి పుస్తకాలను పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేస్తూ భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.భక్తుల రాకతో గోదావరి వారధి సందడిగా మారింది.రామనామ జపంతో పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.భక్తులు భక్తిపారవశ్యంలో మునిగి శ్రీ సీతారామచంద్రస్వామివారిని ప్రార్థించారు.రామకోటి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు విజయ రాఘవన్, ఆలయ సూపరింటెండెంట్ లు కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబా, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులర్ డాక్టర్ ను నియమించాలి సిపిఐ

- ప్రభుత్వ హాస్పిటల్లో సమస్యలు పరిష్కరించాలి
- సిపిఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహారదీక్ష




**గుండాల అక్టోబర్ 7 ప్రజా జ్యోతి** గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలను పరిష్కరిస్తూ రెగ్యులర్ డాక్టర్ను నియమించాలని సిపిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరవేదిక నిరాహార దీక్ష చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం ముందు ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షను ఉద్దేశించి సిపిఐ మండల కార్యదర్శి వాగపోయిన రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె షాహిద్ మాట్లాడుతూ నాలుగు నెలల నుండి రెగ్యులర్ డాక్టర్ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోగ్య కేంద్రంలో సమస్యలతో సతమతమవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని విమర్శించారు. రెగ్యులర్ డాక్టర్ను నియమించకుండా రోజుకో డాక్టర్ను డిప్యూటేషన్ పై పంపించడం సిగ్గుచేటన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఒకే ఒక ప్రాథమిక హాస్పటల్లో రెగ్యులర్ డాక్టరు లేక ఏజెన్సీలోని గిరిజన పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి హాస్పటల్లో సిబ్బందిని నియమిస్తూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓకే సమ్మయ్య, బచ్చలి రామయ్య, గడ్డం శ్రీను, సాహెబ్, లక్ష్మయ్య, కన్నయ్య, రవి వర్మ, రవీందర్, చంద్రయ్య, వసంతరావు, సమీర్, పవన్ కళ్యాణ్, నారాయణ, రమేష్, బిక్షం, సతీష్, మహేందర్, నసీర్, యశ్వంత్, షబ్బీర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు ఘనంగా శ్రీమంతాలు



**చర్ల, అక్టోబర్ 07: (ప్రజాజ్యోతి ):** ఐసీడీఎస్ ప్రాజెక్టు చర్ల పరిధిలోని చర్ల సెక్టార్ పూజారిగూడెం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం సెక్టార్ స్థాయి సంయుక్త శ్రీమంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ కే. రేవతి ముఖ్య అతిథిగా హాజరై గర్భిణులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీడీపీఓ రేవతి మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఎంతో కీలకమైన మొదటి 1000 రోజుల ప్రాధాన్యతను వివరించారు. బిడ్డ జన్మించిన గంటలోపే ముర్రిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. ఆరు నెలల అనంతరం రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు అదనపు సంపూరక ఆహారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ టి. ఆదిలక్ష్మి, పోషణ్ అభియాన్ బ్లాక్ కో–ఆర్డినేటర్ పి. నాగరాజు, చర్ల పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉప్పరగూడెం పంచాయతీ సర్పంచ్ నాగలక్ష్మి, ఏఎన్ఎం లలిత, ఆశా కార్యకర్తలు రాధిక, వెంకటలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## నేడు పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో రావి- వేప చెట్ల పున: ప్రతిష్టాపన



**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి )** పాల్వంచ మండల పరిధిలోని కెపి, జగన్నాధపురం గ్రామం లో కొలువుతీరిన పెద్దమ్మ తల్లి ఆల య ప్రాంగణంలో నేడు గురువారం రావి– వే ప చెట్ల పున ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు, ఆలయ ప్రాంగణంలో కొన్ని వేల సంవత్సరాలుగా ఉన్న రావి వేప చెట్లు ఇటీవల కురిసిన భారీ వర్షానికి నేలకొరకగా వాటి స్థానంలో భక్తు ల మనోభావాల కనుగుణంగా పాల్వంచకు చెందిన అమ్మవారి భక్తులు ముక్తేవి గిరీష్, హర్షిని దంపతుల సహకారంతో రావి వేప చెట్ల పున ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దాత ముక్తేవి గిరీష్ తెలిపారు, గురువా రం ఉదయం 8 గంటలకు ప్రారంభించే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఇసుక రవాణాలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 7, (ప్రజా జ్యోతి )** జిల్లాలో ఇసుక రవాణా కారణంగా ట్రాఫిక్ సమస్యలు రాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తో కలిసి బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరం లో ఇసుక రవాణా, వాహనాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ ప్రాంతాలు, అక్రమ ఇసుక రవాణా తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఇసుక వాహనాల రాకపోకలు అధికంగా ఉన్న మణుగూరు, చర్ల, భద్రాచలం, బూర్గంపాడు ప్రాంతాల్లో రోడ్ల సామర్థ్యం, ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాహనాల ఎంట్రీ, ఎగ్జిట్లను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో లారీలు రోడ్లపైకి రాకుండా అవసరానికి అనుగుణంగా దశలవారీగా వాహనాలను పంపించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.మణుగూరు, రామాంజవరం ప్రాంతాల్లో అవసరమైన హోల్డింగ్, పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని, చర్ల నుంచి భద్రాచలం మార్గంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రాచలం రహదారి మరమ్మతుల నాణ్యతపై తక్షణమే పరిశీలన చేసి నివేదిక అందించాలని సూచించారు.బూర్గంపాడు పరిధిలో గొల్లగూడెం, సారపాక బ్రిడ్జి, తాళ్లగూడెం, ఉప్పాక, పినపాక పట్టినగర్ తదితర ప్రాంతాల్లో ఇసుక రవాణా వల్ల ఏర్పడుతున్న సమస్యలను గుర్తించి ప్రత్యామ్నాయ పార్కింగ్, హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్లు, ఇతర అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరంజిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ఇసుక రవాణా పెరిగే ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా ట్రాఫిక్ మార్షల్స్ను అదనంగా ఏర్పాటు చేయాలని సూచించారు. మణుగూరు, చర్ల ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా టీజీఎండీసీ అధికారులతో సమన్వయం చేసుకొని వాహనాల సాఫీ రాకపోకలకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఒకేసారి అదనంగా వాహనాలు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే విధంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లాలోకి అక్రమంగా ఇసుక రవాణా జరిగే అవకాశాలను నిరోధించేందుకు సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. సీజ్ చేసిన ఇసుకను అక్కడే నిల్వ ఉంచకుండా తదుపరి చర్యల కోసం తరలించేలా ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వాహనాలు, జేసీబీలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఇసుక రవాణా, ట్రాఫిక్ నిర్వహణ, అక్రమ ఇసుక రవాణా నియంత్రణలో పోలీసు, రెవెన్యూ, టీజీఎండీసీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఆర్ఓ పద్మావతి,కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడి మైన్స్ దినేష్, జిల్లా రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి, తాసిల్దారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పూసుగుప్పలో ఆరోగ్య శిబిరం



**చర్ల, అక్టోబర్ 7(ప్రజాజ్యోతి ):** చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హారిక ఆధ్వర్యంలో బుధవారం పూసుగుప్ప ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 22 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు.విద్యార్థుల్లో ఎక్కువ మంది చర్మ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించిన వైద్య సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సీజన్లో వచ్చే జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రోజుకు రెండు సార్లు స్నానం చేయడంతో పాటు భోజనానికి ముందు, తర్వాత, బాత్రూం ఉపయోగించిన అనంతరం తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం సిద్ధం చేసిన ఆహారాన్నివైద్య సిబ్బంది పరిశీలించి, పరిశుభ్రత, నాణ్యతకు సంబంధించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, పాఠశాల టీచర్లు కవిత, ప్రణతి, ఆశా కార్యకర్తలు లావణ్య, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోషణ మాసంలో వంటల పోటీ



**చర్ల, అక్టోబర్ 07: (ప్రజాజ్యోతి ):** 9వ పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా చర్ల మండలం ఆంజనేయపురం సెక్టార్ పరిధిలోని చెన్నాపురం అంగన్ వాడీ కేంద్రంలో మహిళలకు వంటల పోటీ నిర్వహించారు. ఈ పోటీలో మహిళలు ఆకుకూరలు, కూరగాయలు, దుంపలు, మాంసాహారం, దంపిన బియ్యం, చిరుధాన్యాల అన్నం, కాల్చిన చేపలు, దొబ్బెకూర, బొద్దుకూర, కాకరాకు అన్నం, చిరుధాన్యాల పాయసం తదితర పోషక విలువలతో కూడిన వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు.వంటకాల్లోని పోషక విలువలు, వాటిని తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం వంటల పోటీలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిని మడవి మంగే, ద్వితీయ బహుమతిని మడకం దేవి, తృతీయ బహుమతిని కుంజం లక్ష్మి అందుకున్నారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ బంధ స్వరూపరాణి, అంగన్ వాడీ టీచర్లు సోడి చంద్రావతి, త్రివేణి పాల్గొన్నారు. గ్రామస్తులు మీడియం శిరీష, మడకం ఆడిమే, మడివి లక్ష్మి, కరటం మంగే, మడకం సోమి, కెరటం భీమా, కొవ్వాసి దేవి, భుద్రి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మ్యూజియంతో విద్యార్థులకు చారిత్రక అవగాహన

- గిరిజన జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలపై ప్రత్యక్ష పరిజ్ఞానం




**భద్రాచలం, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి ):** గిరిజన మ్యూజియంతో విద్యార్థులకు గిరిజనుల చరిత్రపై అవగాహన కలుగుతుందని ఇల్లందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర సహాయ ఆచార్యులు డాక్టర్ జి శేఖర్ అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇల్లందు విద్యార్థులు భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్ని సందర్శించారు.గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆర్థిక కార్యకలాపాలపై విద్యార్థులు ప్రత్యక్ష అవగాహన పొందారు. మ్యూజియం ఇంచార్జి వీరస్వామి వివిధ ప్రదర్శనలను పరిచయం చేసి గిరిజనుల చారిత్రక, సామాజిక జీవన విధానాన్ని వివరించారు.సంప్రదాయ గృహోపకరణాలు, వ్యవసాయ పనిముట్లు, వేట పరికరాలు, ఆభరణాలు, వేషధారణకు సంబంధించిన వస్తువులను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు.గిరిజనులు సహజ వనరులతో తమ అవసరాలకు అనుగుణంగా వస్తువులను తయారు చేసుకునే విధానాన్ని తెలుసుకున్నారు.ఆహారపు అలవాట్లు, వ్యవసాయ పద్ధతులు, పండుగలు, జాతరలు, ఆచారాలు, విశ్వాసాలపై అవగాహన కల్పించారు.సంప్రదాయ సంగీత వాయిద్యాలను పరిశీలించిన విద్యార్థులు వాటి వినియోగం గురించి తెలుసుకున్నారు.చరిత్రను పుస్తకాలతో పాటు ప్రత్యక్ష ఆధారాల ద్వారా అధ్యయనం చేయడం వల్ల అవగాహన మరింత పెరుగుతుందని డాక్టర్ జి. శేఖర్ తెలిపారు. మ్యూజియం సందర్శన తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు.

# పాల్వంచలో రహదారుల ఆధునీకరణకు శ్రీకారం

- ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు వేగంగా పూర్తి చేయాలి
- నాణ్యతా ప్రమాణాల్లో రాజీ వద్దు
- నూతన కమ్యూనిటీ హాల్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- మౌలిక వసతుల కల్పనకు నిరంతర కృషి చేస్తాం-కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**పాల్వంచ, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి:** పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రహదారుల ఆధునీకరణ పనులను చేపడుతున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా రహదారి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.పాల్వంచ పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రధాన కూడలి అంబేద్కర్ సెంటర్ పరిధిలో రహదారులు పూర్తిగా దెబ్బతిని వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే పట్టణంలోని పలు ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయని విమర్శించారు. ప్రజల అవసరాలు, మౌలిక వసతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.నిత్యం రద్దీగా ఉండే అంబేద్కర్ సెంటర్ మార్గంలో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి రహదారి పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు వివరించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎక్కడా రాజీ పడకుండా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

### ›› రూ.27 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

అనంతరం నవభారత్ సీఎస్ఆర్ నిధులతో శేఖరం బంజరలో రూ.27 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి వచ్చిన నూతన కమ్యూనిటీ హాల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేషన్ కమిషనర్ కె. సుజాత, నవభారత్ అధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మూర్తి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, గొర్లె అన్నపూర్ణ, బండి నరసింహ, కాల్వ భాస్కర్, గుణచరిత, బాలు నాయక్, కాంగ్రెస్ నాయకులు మహీపతి రామలింగం, టీడీపీ నాయకులు కనగాల అనంతరములు, సీపీఐ నాయకులు నిమ్మల రాంబాబు, డి. సుధాకర్, శనగారపు శ్రీనివాసరావు, గొర్లె నరేష్, నామ పండు, నూనావత్ దినేష్, వాడే లక్ష్మి, వజ్జ రాజేశ్వరి, ఎం.డి. యూసుఫ్, సత్యనారాయణ చారి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉచ్చులతో వన్యప్రాణుల వేటకు యత్నం

- నలుగురు అరెస్ట్



**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 7, (ప్రజా జ్యోతి)** పాల్వంచ మండల పరిధిలోని సూరారం బీట్ పరిధిలో గల టిఎస్ ఎఫ్ డి సి జామాయిల్ ప్లాంటేషన్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేటకు విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసిన నలుగురు వ్యక్తులను అటవీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. పాండురంగాపురం గ్రామానికి చెందిన సున్నం మధు, ముద్రబోయిన సురేష్, ఎల్లబోయిన శ్రీను, రెడ్డిగూడెం గ్రామానికి చెందిన జమ్ముల కృష్ణ లు ఈ ఘటనలో నిందితులుగా గుర్తించారు.సమాచారం అందుకున్న వెంటనే అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ శాఖ అధికారుల సహాయంతో ప్రమాదకరమైన ఉచ్చులను తొలగించారు.ఉచ్చులను తొలగించేందుకు నిందితులు తిరిగి సంఘటనా స్థలానికి వచ్చిన సమయంలో అటవీ అధికారులు వారిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.నిందితుల వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన బైండింగ్ వైరు, గుటాలు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై సంబంధిత అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.వన్యప్రాణుల వేటకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పాల్వంచ ఎఫ్ ఆర్ ఓ సురేష్ తెలిపారు.అక్రమ విద్యుత్ ఉచ్చుల వల్ల వన్యప్రాణులతో పాటు అటవీ సిబ్బంది, ప్రజల ప్రాణాలకు కూడా ప్రమాదం ఉంటుందని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ వో క్రాంతికుమార్, ఎఫ్ బి ఓ లు, బేస్ క్యాంప్ సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.

# పోడు భూములపై జోక్యం చేస్తే ఉద్యమమే

- అటవీ అధికారుల వైఖరి మార్చుకోవాలి
- పోడు రైతులకు అండగా తెలంగాణ రైతు సంఘం: అన్నవరపు సత్యనారాయణ



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 7, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని జానకిపురం గ్రామంలో కోటయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల పోడు రైతుల సర్వసభ్య సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం కనుసన్నల్లో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. పోడు భూములకు హక్కులు కల్పించాల్సిన ప్రభుత్వం అటవీ అధికారుల చర్యలను అడ్డుకోకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లోని తోటలను తొలగిస్తూ పోడు సాగుదారులపై అటవీ అధికారులు నిర్బంధం ప్రయోగిస్తున్నారని అన్నారు.అన్నపురెడ్డిపల్లి మండలంలో ఒక్క పోడు భూమి జోలికి వచ్చినా సహించేది లేదని అన్నవరపు సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పోడు రైతుల సమస్యలపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అటవీ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని చెబుతున్న ఎమ్మెల్యే రైతులపై వేధింపులను ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. అటవీ అధికారులు తమ వైఖరి మార్చుకోకపోతే పోడు రైతులతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పోడు సాగుదారులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించే వరకు తెలంగాణ రైతు సంఘం, అఖిల భారత కిసాన్ సభ రైతులకు అండగా నిలుస్తాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు జంగిలి వెంకటరత్నం, శ్రీనివాస్ రెడ్డి, లింగబోయిన వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, శ్రీను, వెంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ నిర్బంధం ప్రజాస్వామ్యంపై దాడి

- బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తోంది
- రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు



**పాల్వంచ, అక్టోబర్ 7, ప్రజా జ్యోతి:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఆందోళనకు దిగిన ఏఐసీసీ నేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, పార్లమెంట్ సభ్యురాలు ప్రియాంక గాంధీతో పాటు విపక్ష నేతలను పోలీసులు నిర్బంధించడాన్ని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశ విధానాలను అవలంబిస్తూ ప్రతిపక్షాల గొంతుకను అణచివేసే ప్రయత్నం చేస్తోందని కొత్వాల ఆరోపించారు. రాహుల్ గాంధీ చేపడుతున్న కార్యక్రమాల ద్వారా ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అవకతవకలను ప్రజల దృష్టికి తీసుకువస్తున్నారని అన్నారు. ఆయన చేపడుతున్న ఆందోళనలకు దేశ ప్రజలు, యువత మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని కొత్వాల అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని తెలిపారు.సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ, టీపీసీసీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా ఆందోళనా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు మద్దతు తెలపాలని కొత్వాల పిలుపునిచ్చారు.

# రామ్‌నగర్‌లో ఘనంగా “మన అంగన్‌వాడీ - మన బాధ్యత”

- పోషణ, శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొన్న 40వ డివిజన్ కార్పొరేటర్ అడుసుమిల్లి సాయిబాబు.





**పాల్వంచ, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి:** తల్లీబిడ్డల ఆరోగ్యం, పోషకాహారం, సంక్షేమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రామ్‌నగర్‌లో “మన అంగన్‌వాడీ – మన బాధ్యత” కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పోషణ మరియు శ్రీమంతం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి 40వ డివిజన్ కార్పొరేటర్ అడుసుమిల్లి సాయిబాబు పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలను పరిశీలించారు. చిన్నారులకు అందించే పోషకాహారం, గర్భిణీల ఆరోగ్య పరిరక్షణ, తల్లీబిడ్డల సంక్షేమానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అడుసుమిల్లి సాయిబాబు మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి చిన్నారులు, గర్భిణీల పోషకాహారం అత్యంత కీలకమని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.తల్లీబిడ్డల ఆరోగ్యం, పోషకాహారం, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు సెనగరపు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, డివిజన్ మహిళలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 14న ఆదివాసీ ఆత్మఘోష మహా ధర్నా

- కరపత్రాన్ని ఆవిష్కరించిన ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు



**భద్రాచలం, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** అక్టోబర్ 14న హైదరాబాద్‌లో నిర్వహించనున్న "చలో హైదరాబాద్–ఆదివాసీ ఆత్మఘోష మహా ధర్నా"ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ మేరకు బుధవారం భద్రాచలంలోని గిరిజన అభ్యుదయ భవన్‌లో భద్రాచలం ఆదివాసీ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహా ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.ఆదివాసీ ల భూమి, హక్కులు, ఉద్యోగాలు, చట్టపరమైన రక్షణల కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని నాయకులు పేర్కొన్నారు.ఆదివాసీల సమస్యల పరిష్కారాని కి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.భూమి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఆదివాసీలకు దక్కాల్సిన ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.చట్టపరమైన రక్షణలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. హైదరాబాద్‌లో జరిగే మహా ధర్నాకు భద్రాద్రి ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో ఆదివాసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. మహా ధర్నాను విజయవంతం చేసేందుకు గ్రామాలు, మండలాల వారీ గా సమన్వయం చేసుకోవాలని సూచించారు. అందరూ ఐక్యంగా పాల్గొని ఆదివాసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జేఏసీ నాయకులు కోరారు.

## విద్యుత్ సమస్యలపై వినియోగదారుల వినతులు

- రాజపురం సబ్‌స్టేషన్ మంజూరుతో మండలంలో మెరుగుపడనున్న విద్యుత్ సరఫరా

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 7, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల పెంట్లం విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మండల ఏఈ సాయి తరుణ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర చైర్‌పర్సన్ మాధవరావు ముఖ్య అతిథిగా హాజరై రైతులు, విద్యుత్ వినియోగదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాలకు చెందిన వినియోగదారులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాజపురంలో సబ్‌స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, నామవరం రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, అబ్బుగూడెంలో నిలిచిపోయిన గృహజ్యోతి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. అన్నపురెడ్డిపల్లి గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని వినియోగదారులు విజ్ఞప్తి చేశారు. రాజపురం గ్రామానికి కొత్త సబ్‌స్టేషన్ మంజూరు కావడం పట్ల రైతు భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, ఇందుకు కృషి చేసిన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.2026లో జిల్లాకు 29 కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు కాగా, అందులో రాజపురం సబ్‌స్టేషన్ కూడా ఉందని అధికారులు తెలిపారు. గత యాసంగిలో జిల్లాలో 680 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, జిల్లాలో సుమారు 70 వేల వ్యవసాయ మోటార్ విద్యుత్ సేవలు ఉన్నాయని వెల్లడించారు. జగనిష్ పథకం ద్వారా రూ.27 కోట్ల నిధులు రావడంతో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సామగ్రి, గృహజ్యోతి పథకం కింద విద్యుత్ మీటర్లు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ మోటార్లకు లైన్ ఏర్పాటు చేసుకునే రైతులకు ఒక కిలోమీటర్ వరకు ఉచిత విద్యుత్ వైరు, స్తంభాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజపురం సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే గ్రామంతో పాటు మండలంలోని రైతులు, గృహ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు తెలిపిన సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.



# ఎన్‌సీడీలపై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి

- క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పించాలి
- దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ తుకారం రాథోడ్

**పాల్వంచ, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి:** జిల్లాలో అసాంక్రమిక వ్యాధుల (ఎన్‌సీడీ) నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టడంతో పాటు, ఇప్పటికే వ్యాధులు నిర్ధారణైన రోగులపై నిరంతరం పర్యవేక్షణ, ఫాలోఅప్ నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ సూచించారు. క్యాన్సర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు గ్రామస్థాయిలో చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.పాల్వంచలోని ఉప వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బద్రాచలం డివిజన్‌తో పాటు అశ్వారావుపేట, గుమ్మడవల్లి, దమ్మపేట, పట్వారిగూడెం పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలతో డీఎంహెచ్‌ఓ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో ఎన్‌సీడీ స్క్రీనింగ్, చికిత్స పొందుతున్న రోగుల ఫాలోఅప్, వ్యాధుల నియంత్రణ, క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ తదితర అంశాలపై సమీక్షించారు.



### ఎన్‌సీడీ స్క్రీనింగ్‌పై ప్రత్యేక దృష్టి

ప్రతి గ్రామంలో ప్రజలకు క్రమం తప్పకుండా రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ తదితర అసాంక్రమిక వ్యాధులకు స్క్రీనింగ్ నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. ఇప్పటికే వ్యాధులు నిర్ధారణైన వారు క్రమం తప్పకుండా చికిత్స పొందుతున్నారా, మందులను సక్రమంగా వినియోగిస్తున్నారా, వైద్యుల సూచనలు పాటిస్తున్నారా అనే అంశాలను ఎంఎల్‌హెచ్‌పీలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రైవేట్ వైద్యుల వద్ద చికిత్స పొందుతున్న ఎన్‌సీడీ రోగులను సైతం గుర్తించి ప్రతి నెలా ఫాలోఅప్ చేయాలని సూచించారు. రోగుల ఆరోగ్య పరిస్థితి, చికిత్స కొనసాగింపు, అవసరమైన పరీక్షల వివరాలను నమోదు చేసి, అవసరమైన సందర్భాల్లో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేయాలని తెలిపారు.

### దోమల వ్యాధుల నియంత్రణకు అవగాహన

డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా, ఫైలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమల వృద్ధి కేంద్రాలను తొలగించడం, జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

### క్యాన్సర్‌పై విస్తృత అవగాహన

అక్టోబర్ నెలలో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి క్యాన్సర్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్సా ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని ప్రజలకు వివరించాలన్నారు.ప్రత్యేకంగా స్తన క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్, నోటి క్యాన్సర్ తదితర వ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. పొగాకు, ఇతర హానికర పదార్థాలకు దూరంగా ఉండటం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం, అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం, అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి అంశాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

### బెడ్రిడెన్ క్యాన్సర్ రోగులకు పాలియేటివ్ కేర్

బెడ్రిడెన్, తీవ్రమైన స్థితిలో ఉన్న క్యాన్సర్ రోగులను గుర్తించి వారికి అవసరమైన సహాయక, ఉపశమన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. అవసరమైన రోగులను కొత్తగూడెంలోని జీజీహెచ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌కు రిఫర్ చేసి, వైద్య, నర్సింగ్, నొప్పి నివారణ, మానసిక, కుటుంబ సహాయక సేవలు అందేలా చూడాలని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఎంఎల్‌హెచ్‌పీల పాత్ర కీలకమని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో వ్యాధుల ముందస్తు గుర్తింపు, క్రమం తప్పని ఫాలోఅప్, ఆరోగ్య అవగాహన, అవసరమైన సందర్భాల్లో సకాలంలో రిఫరల్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.సమీక్షా సమావేశంలో డాక్టర్ టి. ప్రతాప్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, కొత్తగూడెం & పీఓ–సీహెచ్ఐ, డాక్టర్ దినేష్, పీఓ–ఎన్‌సీడీ, డాక్టర్ బి. రాందాస్, పీఓ–ఏఏఎం, సంబంధిత ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

# మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు

- ఇద్దరు అరెస్ట్




**చర్ల, అక్టోబర్ 07(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఆవపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు తయారు చేసి గ్రామంలో భయాందోళనలు సృష్టించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మురదండ గ్రామ పంచాయతీ సర్పంచ్ నారాయణ్ కాకా, ఉపసర్పంచ్ నారాయణ్ కచలం, గ్రామస్తుడు జయమూర్తి చాపడీలను లక్ష్యంగా చేసుకుని ఈ లేఖలను తయారు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. బుధవారం ఉదయం మురదండ గ్రామంలో మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు గ్రామస్తులకు కనిపించాయి. సర్పంచ్ నారాయణ్ కాకా ఉదయం 7 గంటల సమయంలో తన ఇంటి నుంచి కమార్గుడా వైపు వెళ్తుండగా ఇంటి సమీపంలోని రోడ్డుపై రెండు లేఖలను గుర్తించారు. సంఘటనా స్థలంలో మొత్తం ఏడు బెదిరింపు లేఖలు లభించాయి. పాఠశాల భవన నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులను ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు.సర్పంచ్ ఫిర్యాదు మేరకు ఆవాపల్లి పోలీస్‌స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బీజాపూర్ ఎస్పీ ఉమేష్ ప్రసాద్ గుప్తా మార్గదర్శకత్వంలో పోలీసులు సంఘటనా స్థలం, పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టి నిందితులను గుర్తించారు.దర్యాప్తులో మురదండ–బాయేగుడా ప్రాంతానికి చెందిన సందీప్ మడ్కం గత ఐదేళ్లుగా సదరు స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. జూన్ 2026లో తహసీల్దార్ స్థలాన్ని సర్వే చేసి, పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు ప్రారంభించడంతో అక్రమ ఆక్రమణను తొలగించారు. దీనిపై కక్ష పెంచుకున్న సందీప్ మడ్కం, నాగేష్ బోడ్కేతో కలిసి మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు తయారు చేసి మురదండ–కమార్గుడా మార్గంలో పడేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది అని సేకరించిన ఆధారాల ఆధారంగా ప్రధాన నిందితులు సందీప్ మడ్కం, నాగేష్ బోడ్కేలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఛత్తీస్‌గఢ్ జనసురక్ష చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది అని అధికారులు తెలిపారు.మావోయిస్టుల పేరు తో బెదిరింపు లేఖలు, అనుమానాస్పద కార్యకలాపాలు లేదా భయాందోళనలకు గురిచేసే సమాచారం కనిపించినా ప్రజలు ఆందోళన చెందకుండా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. నిషేధిత సంస్థల పేరుతో ప్రజలను బెదిరిస్తూ ప్రభుత్వ పనులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.



# ఇటు దేవుడి భక్తి... అటు ప్రజాసేవ!

**‘అన్నా’ అంటే చాలు.. "నేనున్నా"నే భరోసా!**

- కష్టాల్లో ఉన్నవారికి చేతనైన సాయం
- ఆపదలో అండగా నిలుస్తున్న మానవతావాది
- నిత్యం ప్రజల్లోనే ఉంటూ సమస్యలు తెలుసుకుంటున్న వైనం
- సాయం అడిగితే లేదనని స్వభావం
- వందలాది మందికి తనవంతు చేయూత
- ప్రజా సేవ నుంచి 13వ వార్డు కౌన్సిలర్ స్థాయికి
- ప్రజలతో మమేకమే లక్ష్యం
- దండు సారయ్య
- తన రెండు ఇండ్లను ట్రాన్స్ జెండర్లకు ఇచ్చిన దాన గుణం
- సేవాగుణంపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం

















**ఇల్లందు, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** ప్రజా జీవితంలో పదవి కంటే ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవడమే గొప్ప విషయం. కష్టకాలంలో ఒక మాట ధైర్యం చెప్పడం.. అవసరమైనప్పుడు చేతనైన సాయం చేయడం.. సమస్య ఎదురైనప్పుడు ‘నేనున్నాను’ అంటూ భరోసా కల్పించడం.. ఇవే ప్రజలకు ఒక వ్యక్తిపై నమ్మకాన్ని పెంచుతాయి. అలాంటి సేవా భావంతో ప్రజల మధ్య ఉంటూ, తనకు చేతనైన మేరకు ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న వ్యక్తిగా ఇల్లందు 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య గుర్తింపు పొందుతున్నారు. ఒకవైపు దేవుడిపై భక్తి, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం.. మరోవైపు ప్రజా సేవకు ప్రాధాన్యత ఇవ్వడం ఆయన దైనందిన జీవితంలో భాగంగా మారింది. తనను ఆశ్రయించిన ప్రతి ఒక్కరికీ సాధ్యమైనంత మేరకు సహాయం చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్న ఆయన.. కులం, మతం, వర్గం, రాజకీయాలకు అతీతంగా ప్రజలతో మమేకమవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

### ›› ‘అన్నా’ అంటే.. నేనున్నా!

ప్రజల్లో దండు సారయ్యకు ఏర్పడిన నమ్మకానికి ప్రధాన కారణం ఆయన అందుబాటులో ఉండే స్వభావమని పలువురు చెబుతున్నారు. ఎలాంటి సమస్యతో వచ్చినా ముందుగా వారి మాట వినడం.. సమస్య తీవ్రతను అర్థం చేసుకోవడం.. తన పరిధిలో సాధ్యమైన పరిష్కారం కోసం ప్రయత్నించడం ఆయనకు అలవాటుగా మారిందని పేర్కొంటున్నారు. ‘అన్నా..’ అంటూ కష్టాన్ని చెప్పుకున్న వారికి ‘నేనున్నాను’ అనే ధైర్యం ఇవ్వడం ఆయన సేవా తత్వానికి ప్రతీకగా మారిందని అంటున్నారు.

### ›› కష్టాల్లో ఉన్నవారికి చేయూత

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, అనారోగ్య పరిస్థితులు, అత్యవసర అవసరాలు వంటి సందర్భాల్లో తనను ఆశ్రయించిన వారికి తనకు చేతనైన మేరకు సహాయం అందించేందుకు 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ముందుకు వస్తారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. సాయం చేయడం అంటే కేవలం డబ్బుతోనే కాదని.. అవసరమైన సమయంలో ఒక మాట ధైర్యం చెప్పడం, సమస్య పరిష్కారానికి మార్గం చూపించడం, సంబంధిత వ్యక్తుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడం కూడా సేవేననే భావనతో ఆయన వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు.

### ›› సాయం అడిగితే లేదనే స్వభావం

ప్రజా జీవితంలో ప్రతి ఒక్కరి అవసరాలను తీర్చడం సాధ్యం కాకపోయినా.. తనను ఆశ్రయించిన వారికి కనీసం స్పందించడం మాత్రం తన బాధ్యతగా భావిస్తారని ఆయనను దగ్గరగా చూసిన వారు చెబుతున్నారు. ‘నా వల్ల అయ్యేది చేస్తాను’ అనే ధోరణితో ముందుకు సాగుతూ.. అవసరంలో ఉన్నవారిని ఖాళీ చేతులతో పంపించకూడదనే మానవతా దృక్పథం ఆయనలో కనిపిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### ›› వందలాది మందికి అండగా..

ఇప్పటికే తన పరిధిలో వందలాది మందికి వివిధ సందర్భాల్లో తనవంతు సహాయం అందించినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. వ్యక్తిగత ప్రచారం కంటే అవసరంలో ఉన్న వ్యక్తికి సహాయం చేయడానికే ప్రాధాన్యత ఇస్తారని పేర్కొంటున్నారు. ప్రజా సమస్యలపై స్పందించడం, బాధితులకు అండగా నిలవడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు.

### ›› నిత్యం ప్రజల్లోనే..

ప్రజలకు దూరంగా ఉంటే వారి సమస్యలు అర్థం కావని.. ప్రజల మధ్య ఉంటేనే వారి కష్టాలు, అవసరాలు తెలుస్తాయని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య భావిస్తున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అందుకే వార్డు పరిధిలో జరిగే సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజల మధ్య ఉండటం.. ప్రజల సమస్యలు వినడం.. సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు ప్రయత్నించడం ఆయన ప్రజా జీవితంలో ప్రధాన భాగంగా మారింది.

### ›› భక్తితో పాటు మానవతా సేవ

దేవుడిపై భక్తి చూపడంతో పాటు.. ఆ భక్తి ద్వారా కలిగే మానవతా విలువలను ఆచరణలో పెట్టడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడమే కాకుండా.. అన్నదానం, పేదలకు సహాయం, అవసరంలో ఉన్నవారికి చేయూత వంటి కార్యక్రమాల్లో తనవంతు పాత్ర పోషిస్తూ వస్తున్నారని చెబుతున్నారు. దేవుడిని పూజించడం ఎంత ముఖ్యమో.. కష్టాల్లో ఉన్న మనిషికి అండగా నిలవడం కూడా అంతే ముఖ్యమనే భావన ఆయనలో బలంగా ఉందని పేర్కొంటున్నారు.

### ›› ప్రజా సేవ నుంచి కౌన్సిలర్‌గా..

ప్రజలతో మమేకమవుతూ, తనకు చేతనైన సేవ చేస్తూ వచ్చిన దండు సారయ్య ప్రస్తుతం ఇల్లందు 13వ వార్డు కౌన్సిలర్‌గా ప్రజాప్రతినిధి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రజా సేవలో సంపాదించిన అనుభవం.. ఇప్పుడు వార్డు ప్రజల సమస్యలను మరింత దగ్గరగా అర్థం చేసుకునేందుకు ఉపయోగపడుతుందని ఆయన అనుచరులు, సన్నిహితులు చెబుతున్నారు. పదవి అనేది హోదా కోసం కాదు.. ప్రజలకు మరింత దగ్గరగా ఉండి సేవ చేసేందుకు లభించిన బాధ్యత అనే భావనతో ముందుకు సాగుతున్నారని పేర్కొంటున్నారు.

### ›› ప్రజలతో మమేకమే అసలు బలం

ప్రజలతో సంబంధం కొనసాగించడం, వారి సమస్యలను నేరుగా వినడం, ఆపదలో అండగా నిలవడం ద్వారానే ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చనే ఆలోచనతో 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ముందుకు సాగుతున్నారని పలువురు అంటున్నారు. రాజకీయాలకు అతీతంగా మానవతా కోణంలో అవసరంలో ఉన్నవారికి సాయం చేయాలనే ప్రయత్నం తనకు ఉందని ఆయన చెబుతున్నట్లు సన్నిహితులు పేర్కొంటున్నారు.

### ›› పదవి కన్నా.. ప్రజల నమ్మకమే ముఖ్యం!

ప్రజా జీవితంలో పదవులు మారవచ్చు. కానీ కష్టకాలంలో అండగా నిలిచిన వ్యక్తిపై ప్రజలకు ఏర్పడే నమ్మకం మాత్రం ఎక్కువకాలం నిలుస్తుంది. అదే నమ్మకాన్ని సంపాదించుకోవడమే తన లక్ష్యంగా 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ముందుకు సాగుతున్నారని ఆయన అభిమానులు చెబుతున్నారు.

### ›› తన రెండు ఇండ్లను ట్రాన్స్ జెండర్లకు ఇచ్చిన దానం

తన రెండు ఇండ్లను సైతం తనకు ఉంచుకోకుండా తన వెంట నిలిచే ట్రాన్స్ జెండర్లకు ఇచ్చిన దానగుణం ఆయనదే అని చెప్పొచ్చు. ప్రస్తుత సమాజంలో ఎవరు ఏమైపోతే నాకేంటి.. నేను ఆర్థికంగా ఉన్నారా లేదా అని చూసే రోజుల్లో.. తన వెంట ఉండే వారికి ఎంతో కొంత న్యాయం చేయాలనే ఆలోచన కొందరికే ఉంటుంది. ఆ కొందరికి ఆలోచన ఉండే దానిలో అగ్రభాగాన 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఉంటాడని అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తనకు నిత్యం అందుబాటులో ఉండే ట్రాన్స్ జెండర్లకు ఎంతో కొంత న్యాయం చేయాలని ఆత్రుతతో తనకు ఏమీ లేకుండా పర్వాలేదని, 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్యకు ఉన్న రెండు ఇండ్లను సైతం తనతో నిత్యం అందుబాటులో వెన్నంటే ఉండే ట్రాన్స్ జెండర్లకు ఇవ్వడం ఆయన మానవతావాదానికి నిదర్శనమనే చెప్పొచ్చు. ఎవరు ఎన్ని చెప్పిన.. తాను నమ్మిన వ్యక్తిత్వాన్ని మరువరి మనిషిగా తనను నమ్ముకున్న వారికి ఏదో ఒక న్యాయం చేయాలని ఆత్రుత ఉండడం మనం అరుదుగా చూస్తుంటాం. ఇదే కోవాలో ప్రస్తుత ఇల్లందు మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఉండడం ఇల్లందుకే గర్వకారణమని ఎందరో పేర్కొంటున్నారు.

### ›› వినాయక మండపాల లోనూ సేవాగుణం

ఇల్లందు మున్సిపల్ పరిధితో పాటు గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో వివిధ కార్యక్రమాల కోసం తన ఇంటికి వచ్చే వారికి కాదనకుండా తన చేతనైన చందా రూపంలో రాయడంతో పాటు జాప్యం లేకుండా ఆర్థికంగా సహాయం చేయడం ప్రస్తుత 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య సేవాగుణానికి నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు. సుమారుగా ఎన్నో వందల మండపాలకు పూజల నిమిత్తం.. అన్న ప్రసాద నిమిత్తం తన వద్దకు వచ్చే వారికి కాదనకుండా.. లేదనకుండా ప్రస్తుత 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్యకు ఉన్న దైవభక్తి.. సేవా దృక్పథానికి నిదర్శనం అని ఎందరో పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో సైతం ఇదే తరహాలో సేవా కార్యక్రమాలతో పాటు ఆర్థిక సహాయాలను కొనసాగించాలని ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు. భక్తి.. సేవ.. మానవత.. ప్రజలతో మమేకం అనే ఈ నాలుగు అంశాలను తన ప్రజా జీవితానికి ఆధారంగా చేసుకోని ముందుకు సాగుతున్న 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్యకు ప్రజల్లో మరింత ఆదరణ లభిస్తుందా... ప్రజాసేవలో ఆయన ప్రయాణం మరింత విస్తృతమవుతుందా... అనేది రానున్న రోజుల్లో తేలనుంది. “సమస్య చెప్పడానికి వెళ్తే ముందుగా మన మాట వింటారు.. తనకు చేతనైన సాయం చేస్తానని ధైర్యం చెబుతారు. ఆపదలో ఉన్నప్పుడు పలకరించే వ్యక్తి ఉండటం కూడా ఒక పెద్ద అండ అని స్థానికులు, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**● గిరిజన కౌలు రైతే లక్ష్యంగా రూ. 2.50 కోట్ల భూకబ్జా ప్రణాళిక నడిచిందా..? ● సత్తుపల్లి వ్యాపారితో రూ. 50 లక్షల ముందస్తు అడ్వాన్స్ దందా జరిగినట్లు ఆరోపణలు! ● భూమిని ఖాళీ చేసేందుకే రూ. 70 లక్షల జామాయిల్ తోట ధ్వంసం చేశారంటున్న బాధిత వర్గాలు! ● కౌలు రైతును బెదిరించడమే పనిగా లక్ష్మీదేవిపల్లి పోలీసుల ఏకపక్ష వైఖరిపై విమర్శలు! ● జామాయిల్ తుడిచిపెట్టి పామాయిల్ తోట నాటే కుట్ర వెనుక 'అనిల్' ముఠా ప్రమేయం ఉందా..? ● ఎమ్మార్వో శిరీష స్పష్టమైన విచారణ నివేదిక ఇచ్చినా కదలని పోలీస్ యంత్రాంగం! ● మాజీ సీఐ రాయల వెంకటేశ్వర్లు సమక్షంలో 25% వాటా పంచాయితీలు నడిచాయనేది నిజం కాదా..? ● పోలీస్ బాస్ జోక్యం చేసుకుని ఈ కోట్ల 'భూ' ముఠా గుట్టు రట్టు చేయాల్సిందే!**



# 60 ఎకరాల 'భూకబ్జా స్క్రిప్ట్'.. రూ.2.50 కోట్ల బేరం?

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి;** లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల రెవెన్యూ గ్రామ పరిధిలోని మున్యాతండా వద్ద ఉన్న సుమారు 60 ఎకరాల విలువైన భూమి చుట్టూ జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ అమ్యాన్ని లోతుగా చూస్తే ఇది కేవలం ఒక కౌలు రైతు పంట నరికివేత వివాదం మాత్రమే కాదని, దీని వెనుక పక్కా పథకం ప్రకారం సాగుతున్న ఒక భారీ 'భూకబ్జా స్క్రిప్ట్' ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2014 నుంచి రక్తాన్ని నీరుగా మార్చి జామాయిల్ తోటను సాగు చేస్తున్న గిరిజన కౌలు రైతు అజ్మీరా మురళిని భూమి నుంచి శాశ్వతంగా పంపించేస్తే, కోట్ల విలువైన ఈ భూమిని సులువుగా చేజిక్కించుకోవచ్చని కొందరు బడా బాబులతో కలిసి అనిల్ బాబు వేసిన వ్యూహం ఇప్పుడు వెలుగులోకి వస్తోంది.

**సత్తుపల్లి వ్యాపారితో రూ. 2.50 కోట్ల బేరం!**

రెవెన్యూ శాఖ వర్గాల నుంచి సేకరించిన రికార్డుల ప్రకారం.. రేగళ్ల పరిధిలోని సర్వే నంబర్లు 14, 14/ర లో సోమరాజు ప్రసన్నకుమారి పేరిట 39.39 ఎకరాలు, ఆమె సోదరుడు సోమరాజు వెంకట రాంప్రసాద్ కుటుంబీకుల పేరిట 14/డ2, 14/డ3లో మరో 20 ఎకరాల భూమి నమోదై ఉంది. మొత్తంగా ఇది సుమారు 60 ఎకరాల విస్తీర్ణం. అయితే భూ పట్టాదారులైన ప్రసన్నకుమారి అమెరికాలో, వెంకట రాంప్రసాద్ హైదరాబాద్‌లో స్థిరపడటంతో.. ఈ భూమిని గిరిజన రైతు అజ్మీరా మురళికి లీజుకు ఇచ్చారని తెలుస్తోంది. మురళి 2014 నుంచి జామాయిల్ తోట నాటి, 2018లో మొదటిసారి, 2022లో రెండోసారి విజయవంతంగా కోతలు పూర్తి చేసినట్లు ఎమ్మార్వో నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. అయితే అసలు భూ యజమానులు ఇక్కడ లేకపోవడాన్ని అదునుగా భావించిన స్థానికంగా ఉండే వారి కుటుంబ సభ్యుడు 'అనిల్' అనే వ్యక్తి, ఈ కోట్ల విలువైన భూమిపై కన్నేసి రకరకాల వ్యూహాలు పన్నినట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వ్యవహారంలో అత్యంత సంచలనాత్మకమైన కోణం ఏమిటంటే.. ఈ 60 ఎకరాల్లోని 25 ఎకరాల భూమిని సత్తుపల్లికి చెందిన ఒక బడా వ్యాపారికి ఎప్పోడో రూ. 2.50 కోట్లకు విక్రయించేందుకు అనిల్ వర్గం ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందుకోసం సదరు వ్యాపారి వద్ద నుంచి సుమారు రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా కూడా స్వీకరించారని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. అడ్వాన్స్ సొమ్ము చేతికి అందడంతో "సదరు భూమిని ఖాళీ చేయించి తమకు అప్పగించాలి" అని ఆ కొనుగోలుదారుడు ఒత్తిడి తేవడం ప్రారంభించినట్లు సమాచారం. పొలంలో జామాయిల్ తోట ఉండి, కౌలు రైతు సాగులో ఉన్నంతవరకు కొనుగోలుదారుడికి భూమిని చూపించడం లేదా అప్పగించడం కుదరదు కాబట్టి, తోట తొలగింపు ప్రక్రియను వేగవంతం చేశారనే విమర్శలు వస్తున్నాయి.

**స్థానికులతో దౌర్జన్యాలు.. తదుపరి పామాయిల్ తోట ప్రణాళిక..**

ఈ క్రమంలో ముందుగా కౌలు రైతు మురళిని భయభ్రాంతులకు గురిచేసి పొలం నుంచి పంపించేందుకు అనిల్ వర్గం ప్రయత్నించిందని, అయితే మురళి బెదిరింపులకు లొంగకపోవడంతో ప్లాన్ మార్చినట్లు తెలుస్తోంది. స్థానికంగా ఉండే కొందరికి భూమిలో వాటాలు ఇస్తామని, స్థలాలు ఇస్తామని ఆశచూపి వారిని తమ వైపు తిప్పుకున్నట్లు చెబుతున్నారు.

అనంతరం రౌడీషీటర్లు, కొందరు రాజకీయ నాయకులు, స్థానికుల అండతో జామాయిల్ తోటలోకి దౌర్జన్యంగా చొరబడి ఏకంగా 80 శాతం పంటను నరికివేసి విక్రయించుకున్నారనే తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. మిగిలిన 20 శాతం తోటను కూడా నాశనం చేయడంతో కౌలు రైతు మురళికి చెందిన సుమారు రూ. 70 లక్షల విలువైన పంట బూడిదపాలైందని బాధితుడు వాపోతున్నాడు. ఇక ఈ జామాయిల్ తోటను ఇంత దారుణంగా నాశనం చేయడం వెనుక ఉన్న అంతర్గత వ్యూహంపై మరిన్ని ప్రచారాలు సాగుతున్నాయి. ఈ జామాయిల్ తోటను పూర్తిగా తొలగించిన తర్వాత, భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేసి, అందులో పామాయిల్ తోట నాటి సత్తుపల్లి వ్యాపారికి అప్పగించేలా ముందస్తు ఒప్పందం కుదిరినట్లు సమాచారం.

దీంతో ఇది అందారు ఉహించి నట్టు కేవలం కలప అమ్ముకునే చిన్న వివాదం కాదని, కోట్ల రూపాయల రియల్ ఎస్టేట్ మరియు కమర్షియల్ సాగు నెట్‌వర్క్ అని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

**అన్నింటా వాటాల పంపకం..?**

అయితే ఈ దౌర్జన్యంపై బాధితుడు మురళి స్థానిక లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌కు పలుమార్లు వెళ్లినా అధికారులు సరిగ్గా స్పందించలేదనే విమర్శలు ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి ఎమ్మార్వో శిరీష క్షేత్రస్థాయి విచారణ జరిపి.. "రైతు మురళి 2014 నుంచి కౌలు సాగు చేస్తున్నాడు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 1960 నుంచి ఈ భూమి ఒకే పట్టాదారు పేరుపై ఉంది. పంట నరికివేతను వెంటనే నిలిపివేయాలి" అని అధికారికంగా నివేదిక రూపంలో పోలీసులకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. రెవెన్యూ శాఖ తహసీల్దార్ స్థాయి అధికారి నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, జూలై 20, 28 తేదీల్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లోనూ, ఆ తర్వాత ఎస్పీ కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు చేసినా లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేయకపోవడం వెనుక అదృశ్య హస్తాలు ఉన్నాయనే అనుమానాలు బలపడుతున్నాయి. అయితే ఈ మొత్తం భూ భాగోతంలో కొందరు స్థానిక నాయకులు, పోలీసు అధికారులకు కూడా భారీగా లబ్ధి చేకూర్చేలా తెరవెనుక ఒప్పందాలు కుదిరాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. కౌలు రైతును తప్పించి, తోటను తుడిచిపెట్టేందుకు సహకరించినందుకు గాను.. కొందరు అధికారులకు, నేతలకు ఆర్థిక ప్రయోజనాలతో పాటు సదరు 60 ఎకరాల భూమిలోనే నేరుగా వాటాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి.

అసలు ఏ ఏ అధికారులకు, ఏ ఏ రాజకీయ నాయకులకు ఇందులో ఎన్నెన్ని ఎకరాలు కట్టబెడతామని ముందస్తు హామీలు ఇచ్చారు? ఎవరెవరికి ఎంతెంత వాటాలు అందాయనే విషయాలు బయటకు రావాల్సి ఉంది.

ఈ దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులపై నిష్పాక్షిక విచారణ జరిపితేనే నిజాలు వెలుగుచూస్తాయి. అయితే ఇందులో ప్రధానంగా కాంగ్రెస్ నేతలతో పాటు ఓ సిపిఎం నేత పేరు కూడా ప్రచారంలో ఉండడం ఇప్పుడు కొసమెరుపు అంశంగా ఉంది.

## మాజీ సీఐ సమక్షంలోనే '25 శాతం వాటా బేరసారాలు'!

ఇక ఈ భూ దందాలో ప్రధానంగా 'లక్ష్మీదేవిపల్లి మాజీ సీఐ రాయల వెంకటేశ్వర్లు' పాత్రపై కూడా తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంట నరికివేత వివాదం ముదిరిన సమయంలో, సీఐ సమక్షంలోనే ఒక రహస్య పంచాయితీ జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడిస్తున్నాయి. "మురళి ఏళ్లుగా పంట సాగు చేస్తున్నాడు కాబట్టి, నరికిన పంటలో అతనికి 25 శాతం వాటా ఇస్తాం, అతను మాకు అడ్డుపడొద్దని చెప్పండి, అతను మాపై కేసులు పెట్టకుండా చూసుకోండి" అని తోటను నరికిన వ్యక్తులు సీఐ ముందే ప్రతిపాదించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీంతో చట్టాన్ని రక్షించాల్సిన అధికారుల సమక్షంలోనే ఒక కౌలు రైతు కష్టాన్ని 25 శాతానికి బేరం పెట్టడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. 25 ఎకరాల భూమి రూ. 2.50 కోట్ల బేరం, రూ. 50 లక్షల అడ్వాన్స్, పామాయిల్ తోట వేసే కుట్ర, దానికి సహకరించిన పోలీసులు, రౌడీషీటర్లు.. ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న పెద్ద భూకబ్జా దందాకు నిదర్శనాలనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ బాస్ నిష్పాక్షిక విచారణ జరిపి అసలు దోషులను చట్టం ముందు నిలబెట్టాలని బాధిత రైతు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# యువతలో మార్పే..
# నాకు అసలైన సంతృప్తి..!

- కొత్తగూడెం వన్‌టౌన్‌లో మూడున్నరేళ్ల సేవ మరువలేని అనుభూతి!
- గంజాయి బారి నుంచి బయటపడి స్థిరపడిన యువకుల మాటలు ఎంతో ఆనందాన్నిచ్చాయి!
- రాజకీయ జోక్యం లేకుండా బాధితులు నేరుగా వస్తేనే వేగవంతమైన న్యాయం!
- బదిలీ నేపథ్యంలో 'ప్రజాజ్యోతి'తో వన్‌టౌన్ సీఐ కరుణాకర్ ముఖాముఖి మాటలు!

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి (మాలోత్ అశోక్)** "పోలీస్ ఉద్యోగంలో బదిలీలు అనేది చాలా సహజమైన ప్రక్రియ. కానీ, మనం పనిచేసిన ప్రాంతంలో ప్రజలతో ఏర్పడిన బంధం, సమాజంలో ముఖ్యంగా యువతలో తీసుకురాగలిగిన సానుకూల మార్పు, బాధితులకు న్యాయం చేసినప్పుడు లభించిన ఆత్మసంతృప్తి నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతాయి. కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మూడున్నరేళ్ల పాటు సుదీర్ఘంగా బాధ్యతలు నిర్వహించిన సమయం నాకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని ఇచ్చింది" అని హైదరాబాద్‌లోని మల్టీ జోన్-1 తెలంగాణ పోలీస్ కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న వన్‌టౌన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'ప్రజాజ్యోతి'తో ఆయన నేరుగా పంచుకున్న ఇక్కడి సర్వీస్ అనుభవాలు ఆయన మాటల్లోనే..

**అత్యంత సంతృప్తిని ఇచ్చింది 1 టౌన్..**

"నేను పోలీసు అధికారిగా నా కెరీర్‌లో తొలిసారి మహబూబాబాద్ జిల్లా సీరోలు పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించాను. అక్కడ విధులు నిర్వహించినప్పుడు ఎలాంటి సంతృప్తి లభించిందో, ఇక్కడ కొత్తగూడెం వన్‌టౌన్‌లో పనిచేసిన ఈ మూడున్నరేళ్ల కాలంలోనూ సరిగ్గా అలాంటి ఆత్మసంతృప్తి దక్కింది. నేను ఎన్నో స్టేషన్లలో పనిచేసినప్పటికీ, వన్‌టౌన్‌తో ఏర్పడిన అనుబంధం నా గుండెల్లో భద్రంగా ఉంటుంది. ఇక్కడికి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతల పరిరక్షణతో పాటు గొడవలు, సివిల్ తగాదాలు వంటి సమస్యలను అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందడుగు వేశాను.

**ఆ క్షణం.. అత్యున్నత పురస్కారంగా భావిస్తున్నాను..**

అయితే, నా ఈ 15 ఏళ్ల సుదీర్ఘ పోలీస్ సర్వీసులో నాకు అత్యంత తృప్తినిచ్చిన




అంశం ఏమిటంటే.. దారితప్పుతున్న యువతలో మార్పు తీసుకురావడమే! గంజాయి, ఇతర చెడు వ్యసనాల బారిన పడుతున్న కొందరు కుర్రాళ్లను గుర్తించి, వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి సన్మార్గంలో నిలబెట్టే ప్రయత్నం చేశాను. కేవలం కేసులు నమోదు చేసి వారి భవిష్యత్తును నాశనం చేయడం కంటే, ఆ బురద నుంచి వారిని బయటకు తీసుకువచ్చి జీవితంలో స్థిరపడేలా చేయడమే నిజమైన పోలీసింగ్ అని నేను నమ్మాను. ఆ కౌన్సెలింగ్ వల్ల వారి ప్రవర్తనలో వచ్చిన విప్లవాత్మక మార్పు నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ క్రమంలోనే ఇటీవల కొత్తగూడెంలో జరిగిన గణేష్ నిమజ్జనం వేడుకల సమయంలో నా జీవితంలో మరువలేని ఒక సంఘటన జరిగింది. గతంలో గంజాయి కేసుల్లో కౌన్సెలింగ్ పొందిన కొందరు యువకులు స్వయంగా నా దగ్గరకు వచ్చారు. అందులో ఒక కుర్రాడు.. 'సార్, మీ కౌన్సెలింగ్‌తో నా జీవితం మారింది. ఇప్పుడు నేను ఒక కంపెనీలో నెలకు రూ. 25 వేల జీతంతో ఉద్యోగం చేస్తున్నాను సార్' అని సంతోషంగా చెప్పాడు. మరో యువకుడు.. 'సార్, నేను సొంతంగా ఆటో కొనుక్కుని నడుపుకుంటున్నాను.. ఇప్పుడు నా కుటుంబంతో హ్యాపీగా ఉన్నాను' అని చెప్పిన క్షణం, ఒక పోలీస్ అధికారిగా నాకు దక్కిన అత్యున్నత పురస్కారంగా భావిస్తున్నాను.

**బాధితులు నేరుగా వస్తే..**

ఇక పోలీస్ స్టేషన్‌కు వచ్చే పిటిషన్ల నిర్వహణపై నా స్పష్టమైన సలహా ఏంటంటే.. బాధలో ఉన్న బాధితులు ఎవరైనా సరే స్వయంగా స్టేషన్‌కు వచ్చి తమ సమస్యను అధికారులకు నేరుగా చెప్పుకోవాలి. ఎలాంటి రెండో వ్యక్తి ప్రమేయం గానీ, రాజకీయ నాయకుల జోక్యం గానీ లేకుండా బాధితులు నేరుగా వస్తే, అసలు సమస్య ఏమిటో పోలీసులకు స్పష్టంగా అర్థమవుతుంది. దాంతో ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా బాధితులకు తక్షణమే వేగవంతమైన న్యాయం అందించే అవకాశం ఉంటుంది. దీంతో పాటు మేము కూడా నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ఆ నేరానికి మూలకారణాలను గుర్తించి ముందస్తుగానే నిరోధించే విధానంతో ముందుకు వెళ్లడం సమాజానికి చాలా అవసరం. మూడున్నరేళ్ల సుదీర్ఘ సేవ అనంతరం కొత్తగూడెం వన్‌టౌన్ నుంచి హైదరాబాద్‌లోని మల్టీ జోన్-1 తెలంగాణ పోలీస్ కార్యాలయానికి బదిలీపై వెళ్తున్నప్పటికీ, ఇక్కడి ప్రజలతో ఏర్పడిన అనుబంధం ఎప్పటికీ విడిపోనిది. మనం పనిచేసిన ప్రాంతంలో కనీసం ఒక వ్యక్తి జీవితంలో అయినా మంచి మార్పు తీసుకురాగలిగితే అదే మన ఉద్యోగానికి సార్థకత. నా సేవా కాలంలో నాకు పూర్తి సహకారం అందించిన కొత్తగూడెం ప్రజలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు, జర్నలిస్ట్ మిత్రులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు."

# కార్యదర్శి నిర్లక్ష్యంతో సారపాకలో తాగునీటి కష్టాలు!

- పది రోజులుగా నీటి సరఫరా బంద్.. ఖాళీ బిందెలతో గ్రామస్థుల నిరసన
- ఐటీసీ వ్యర్థ జలాల మూలంగా బోర్ పంపుల ద్వారా మురికినీరు



**బూర్గంపాడు, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** తాగునీటి సమస్యతో ప్రజలు పది రోజులుగా అల్లాడుతున్నా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని సారపాక గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తూ బుధవారం ముత్యాలమ్మ గుడి ఎదుట ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.తాగునీరు అందక మహిళలు,వృద్ధులు,చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసినా పంచాయతీ కార్యదర్శి స్పందించకపోవడం పట్ల గ్రామస్థులు మండిపడ్డారు.ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అధికారి అందుబాటులో ఉండి ప్రజల గోడు వినాల్సింది పోయి నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు.

### ›› పది రోజులుగా సమస్య..

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు శూన్యం?

గ్రామంలో పది రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోయినా పంచాయతీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని గ్రామస్థులు తెలిపారు.కనీసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజల ఇబ్బందులను తాత్కాలికంగానైనా తగ్గించాలన్న ఆలోచన కూడా కార్యదర్శికి లేకపోవడం దారుణమన్నారు."ధర్నా చేస్తేనే అధికారులకు సమస్య కనిపిస్తుందా?" అని గ్రామస్థులు ప్రశ్నించారు. ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేసే వరకు స్పందించకపోవడం పంచాయతీ యంత్రాంగం పనితీరుకు అద్దం పడుతోందని విమర్శించారు.

### ›› ఐటీసీ ప్రభావంపై

### ఆందోళన

సారపాకకు సమీపంలో ఐటీసీ కర్మాగారం ఉండటంతో భూగర్భ జలాలపై ప్రభావం పడుతోందని, తద్వారా విడుదలైన వ్యర్థ జలాలు కలుషితం మూలంగా బోర్లలో నీటి లభ్యత తగ్గిపోయి మురికినీరు వస్తుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బోర్లు ఉన్నా నీరు అందుబాటులో లేకపోవడంతో తాగునీటి సమస్య మరింత తీవ్రమవుతోందన్నారు.ఐటీసీ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిస్థితి, బోర్లలో నీటి లభ్యతపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని కోరారు.ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### ›› ఇప్పటికైనా స్పందించాలి

కార్యదర్శి కార్యాలయానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని గ్రామస్థులు కోరారు. తాగునీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించడంతో పాటు, అప్పటివరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని డిమాండ్ చేశారు.పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్య వైఖరి ఇలాగే కొనసాగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు.